
# మర్రిచెట్టు నీడలో...

- పి.వి.డి.ఎస్.ప్రకాష్.



ఉదయాన్నే పేపర్ కోసం తలుపులు తెరిచిన గంగాధరం అక్కడే, ఆ చెట్టు నీడనే, అలాగే వున్న ఆమెని చూస్తూనే కాస్త ఆశ్చర్యపోయాడు.

నిన్న ఉదయం సరిగ్గా అదే సమయంలో ఆమెని అక్కడే చూశాడు. ఆఫీ నుంకి వెళుతున్నప్పుడోసారి, నిన్న రాత్రి కిటికీ తలుపులు మూస్తూ యథాలాపంగా మరోసారి ఆమెని చూశాడు.

మళ్ళీ ఇప్పుడు అక్కడే ఆమెని అలా చూస్తుంటే అదోలా అన్పించింది గంగాధరానికి. రాత్రంగా కటిక చీకట్లో, వణికించే చలి కౌగిట్లో, ముడుచుకు కూర్చున్న ఆమెని తలచుకుంటే గుండెల్ని బాధ పిండేసింది.

గంగాధరం ఫ్లాట్‌కి ఎదురుగా విశాలమైన ఖాళీ స్థలంలో వున్న ఒకే ఒక్క మర్రిచెట్టు ఆమెకు నీడనిచ్చింది.

ఆమె వయసు డెబ్బయ్ దాటొచ్చు. పక్కనే చిన్న బట్టల మూట. అంతకుమించి ఆమె దగ్గర చెప్పుకోదగ్గ వస్తువులేవీ లేవు. ఎక్కడ నుంచి వచ్చిందో, ఎక్కడకు చేరాలనుకుంటుందో, మధ్యలో ఈ మర్రిచెట్టు నీడన మజిలీ ఏమిటో? అంతా అయోమయంగా ఉంది గంగాధరానికి.

ఆఫ్ఘనిస్థాన్‌పై అమెరికా సాగిస్తున్న 'ఉగ్ర యుద్ధ' వార్తల కన్నా ఆసక్తి రేపుతోంది ఆమె. ఆమె గురించి తెలుసుకోవాలనే కుతూహలం క్షణక్షణానికీ రెట్టింపు అవుతోంది. నిన్నట్నుంచి ఇప్పటిదాకా సుమారు ఇరవై నాలుగ్గంటలపాటు ఒకే భంగిమలో కూర్చున్న ఆమె వివరాలు తెలుసుకోవాలని అతనిలో తహతహ, తాపత్రయం.

"ఎవరామె?" ఎవరు చెబుతారు సమాధానం ఆమె తప్ప.

"సుశీలా..." పిలిచాడు గంగాధరం.

"వస్తున్నా..." అంటూ కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమైంది శ్రీమతి. ఆమె తెచ్చిన కాఫీ అందుకుని ఒక గుక్క సిప్‌చేసి అన్నాడు గంగాధరం– "ఆ కిటికీలోంచి ఒక్కసారి చూడు. నీకైనా ఆ 'పజిల్' అర్థం అవుతుందేమో?"

భర్తవైపు ఓసారి వింతగా చూసి తిరిగి కిటికీలోంచి బయటకు చూసింది సుశీల. అతడు చెప్పినట్లు క్లిష్టమైన ఏ 'పజిల్' ఆమెకి కన్పించలేదు. రోజూలాగానే 'రొటీన్'గా ఉదయించిన సూర్యుడు, ప్రసరిస్తున్న వెలుతురు కిరణాలు.

"ఏముంది, వింత?" అన్నట్లు భర్తవైపు చూసింది సుశీల.

"అదికాదు, సరిగ్గా చూడు" విసుగ్గా అన్నాడు గంగాధరం.

"ఆ మైదానంలో ఎవరో చిన్నపిల్లలు ఆడుకుంటున్నారు. సైకిల్ పాలవాడు దూరంగా వున్న ఇంట్లో పాలు పోస్తున్నాడు. కూరల బండివాడు ఇటే వస్తున్నాడు" చెబుతోంది సుశీల.

"అది కాదు..." విసుగ్గా అంటూ పడక్కుర్చీలోంచి లేచి వచ్చిన గంగాధరం సుశీల పక్కనే నిలబడి–

"చూడు, అలా ఆ మర్రిచెట్టు నీడలోకి. ఓ మనిషి కన్పించడం లేదూ" అడిగాడు.

"కన్పిస్తోంది"

"మరి, ఆ సంగతి చెప్పవేం?"

ఇతడికి పిచ్చి ఏమైనా తలకెక్కిందా? అన్న అనుమానపు చూపొకసారి విసిరి అంది సుశీల–

"అందులో ఏముంది వింత? ఎందరెందరో ఆ చెట్టు నీడలో తలదాచుకుంటారు. వారిలో కొందరు మతి చలించిన వాళ్లు, కొందరు బిచ్చగాళ్లు, మరికొందరు వృద్ధులు, ఎవరికీ పట్టనివాళ్లు. అంతే!"

ఆ దృశ్యంపై ఏమాత్రం ఆసక్తి లేనట్లు వంటింట్లోకి జారుకుంది సుశీల. గంగాధరానికి బాధనిపించింది. నిజానికి, ఆమె తినేందుకు మిగిలిన అన్నం ఏదైనా సుశీల ద్వారా పంపించాలని భావించాడు. అయితే, భార్య ప్రవర్తనతో ఇక ఆ విషయం ఎత్తేందుకు ప్రయత్నించలేదతడు.

గబగబా కిందకు దిగి ఆ మర్రిచెట్టు దగ్గరికి నడిచాడు గంగాధరం, దారిలో కన్పించిన టీ బడ్డీ వాడికి 'టీ' చెప్పి మరీ.

మనిషి అలికిడిని గుర్తించకుండా తనదైన లోకంలోనే ఉందామె. ఆమెని చూస్తుంటే గౌరవమైన కుటుంబానికి చెందిన వ్యక్తి లాగానే తోచింది గంగాధరానికి. యాచకురాలిలా లేనేలేదు. అస్థిపంజరానికి అతికించినట్లున్న తోలుపై పడిన ముడతలు ఆమె నడిచిన సుదీర్ఘ జీవనయానానికి శిథిల సాక్ష్యాలుగా నిలిచాయి. పళ్లులేని బోసి నోరు, లోతుకు పోయిన బుగ్గలు. చామన ఛాయ. ఒకప్పుడు బాగా బతికిన వైభవం శుష్కావస్థలో ఉన్న శరీరాన్ని వీడినట్లు లేదు.

"ఏమ్మా?" పలుకరించాడు గంగాధరం.

ఆమెలో ఏ కదలిక లేదు. నిరుత్సాహపడలేదు గంగాధరం. ఇంతలో టీ వచ్చింది. అది ఆమెకు అందిస్తూ "టీ తాగమ్మా!" అన్నాడు మృదువుగా. ఆమె ఆ గ్లాసు అందుకుని నెమ్మదిగా తాగడం ప్రారంభించింది.

అవును మరి! ఈ వయసులో ఎప్పుడు ఏ ఆహారం పుచ్చుకుందో మరి. క్షుద్బాధ ఆమెను వేడివేడి టీని సైతం గడగడా తాగిస్తోంది. ముఖంలో నీరసం తాండవిస్తోంది కూడా.

"ఏమ్మా! ఏ ఊరు? పేరేమిటి? ఎక్కడకు వెళ్లాలి?" నెమ్మదిగా ఒక్కో ప్రశ్న సంధించడం ప్రారంభించాడు గంగాధరం ఇదే అదను అనుకుని.

"ఈ ఊర్లో నీకు తెలిసిన వాళ్లెవరైనా

ఉన్నారా?" మళ్లీ అడిగాడతను.

ఆమె వెంటనే సమాధానం చెప్పలేదు. మౌనంగా టీ సేవనంలో నిమగ్నమై ఉంది. మళ్లీ మళ్లీ ప్రశ్నించాడు గంగాధరం పట్టు విడవకుండా.

"అనాధలా, ఆ మర్రిచెట్టు నీడలో ఎంతకాలం కాలక్షేపం చేస్తుంది ఈ ముసల్ది. ఎవరో ఒకరు ముందుకు వచ్చి ఏదో ఒక దారి చూపించాలి. ఆ ఎవరో తానే ఎందుకు కాకూడదు?" అనుకున్నాడు గంగాధరం.

ఆమెని అలా చూస్తుంటే చనిపోయిన అమ్మ గుర్తొచ్చింది అతడికి. తండ్రి చిన్నతనంలోనే పోతే తల్లీ తండ్రీ తనే అయి పెంచి పోషించిన అమ్మ జ్ఞాపకం అతడి కళ్లలో కన్నీరై వర్షించింది. ఎండనక, వాననక, రాత్రనక, పగలనక కాయకష్టం చేసి వచ్చిన సొమ్మును 'చీరకొంగు'నే దాచుకుని కొడుకు ప్రతి చిన్ని అవసరాన్ని సకాలంలో తీర్చిన ప్రేమమూర్తి అమ్మ గుర్తొచ్చింది అతడికి. తన కడుపు కట్టుకుని, కడుపున పుట్టిన వాడి ఆకలి తీర్చాలనే అనుక్షణం తపించి పోయిందా తల్లి. విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతోద్యోగిగా కొడుకుని చూడాలనే తాపత్రయంతో తల్లడిల్లిన ఆ తల్లి తాను రుణం తీర్చుకునే వేళలో సుదూర తీరాలకు, కనిపించని దూరాలకు తరలిపోయిందామె.

అది గుర్తొచ్చింది గంగాధరానికి.

తల్లి కోరిన విధంగా తాను ఉద్యోగస్తుడయ్యాడు. ఇక, జీవిత చరమాంకంలో తల్లిని తన దగ్గరే ఉంచుకుని సేవలు చేయాలని స్థిరపడుతున్న దశలో పిడుగులాంటి వార్త వచ్చింది- తల్లి చనిపోయిందని. కొన్ని వందల మైళ్ల దూరంలో వున్న గంగాధరం సొంత ఊరు చేరేసరికే అన్నీ అయిపోయాయి. కనీసం ఆఖరి చూపు కూడా దక్కలేదు గంగాధరానికి. ఈ సంగతి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా చెప్పలేని బాధతో విలవిలలాడేవాడతడు. సరిగ్గా, ఇప్పుడూ అంతే! కళ్లలో కన్నీటి తెర.

అందులోంచి ఆమె మసక మసగ్గా, అచ్చం కన్నతల్లిలాగే.

"చెప్పవమ్మా, ఎక్కడికి వెళ్లాలి? మీ వాళ్లెక్కడున్నారు?"

మళ్లీ ప్రశ్నించాడు గంగాధరం. ఒక్కసారి ఉప్పెనలా విరుచుకుపడిందామె. తుపానులో చివురుటాకులా వణికిపోయింది. కన్నీరు మున్నీరైంది. కదిలి కదిలి ఏడ్చింది.

"ఎవరూ లేరు... నాకెవరూ లేరు" ఒకటే సమాధానం.

అంతే!

❀❀❀

ఊరూ-పేరూ తెలీని, దిక్కూ-మొక్కూ లేని ఒక అనాధ కోసం గంగాధరం చూపించే శ్రద్ధ నలుగురిలో చులకనైంది. 'టీ' తెచ్చిన కుర్రవాడు మొదలు, ఇరుగుపొరుగు, ఇంట్లో శ్రీమతి సైతం 'ఎద్దేవా' చేసినట్లు మాట్లాడటం గంగాధరం గమనించకపోలేదు.

"ఎందుకొచ్చిన తద్దినమండీ, ఇదంతానూ"

పక్కింటివారు సలహా ఇవ్వబోయారు.

"ఏమిటండీ ఇది, మతి కాని పోలేదు కదా!"

శ్రీమతి అడ్డుకోబోయింది. అయినా, గంగాధరం మనసులో ఆమె రూపం గాఢంగా ముద్ర వేసుకుంది.

"ఎలాగైనా సరే, ఆమెకు దోవ చూపించాలి" అతడిలో పట్టుదల.

"ఎలా, ఏం చేయాలి? అమ్మని చివరి చూపు చూసుకోలేకపోయాడు. ఆమెకు కొడుకుగా కొరివి పెట్టి 'పున్నామ నరకం' నుంచి తప్పించలేక పోయాడు. కనీసం, ఈ అమ్మకాని అమ్మకైనా ఆఖరి దశలో ఓ మార్గం చూపి సాంత్వన పొందాలి"- అనుకునేవాడు గంగాధరం.

వృద్ధాశ్రమంలోనైనా చేర్పించాలంటే కొంత సొమ్మయినా చెల్లించాల్సిందే. మర్రిచెట్టు నీడలో కృంగి కృశించి పోతున్న ఓ వృద్ధురాలిని ఆదుకుంటానంటే మెచ్చుకుని, విరాళాలు ఇచ్చుకునే వితరణ శీలురెందరున్నారు? ఇంటి చుట్టుపక్కలా, ఆఫీసులోనూ ప్రయత్నించాడు. అందరూ వెనుకకు లాగేవారే తప్ప, వెన్నుతట్టి ప్రోత్సహించేవారే కరువయ్యారు గంగాధరానికి.

చివరికో నిశ్చయానికి వచ్చాడు- ఆఫీసులో లోన్ తీసుకోవాలని. ఆ తీసుకున్న కొద్దిపాటి

మొత్తం బ్యాంకులో వేసి వచ్చే వడ్డీతో ఆ వృద్ధురాలిని ఏ ఆశ్రమంలోనైనా చేర్పించాలని. ఈ ఆలోచన రాగానే ఏ కాస్త ఆలస్యం చేయకుండా రుణ దరఖాస్తుపై సంతకం పెట్టి పై ఆఫీసర్‌కి పంపించాడు.

లోన్ శాంక్షన్ కోసం నిరీక్షిస్తున్నాడు గంగాధరం.

ఇంతలో–

ఆఫీసర్ పిలుస్తున్నాడని అటెండర్ సందేశం మోసుకొచ్చాడు.

ఛాంబర్‌లోనికి వెళ్లాడు గంగాధరం– 'మే ఐ కమిన్ సర్' అంటూ.

"ఎస్, కమాన్!"

చిర్నవ్వుని వెలివేసిన చింపాంజీ ముఖంలా ఎప్పుడూ చిర్రుబుర్రులాడే ఆఫీసర్ సముఖానికి రావాలంటే గంగాధరానికి ఎప్పుడూ ఇష్టం ఉండదు. ఇప్పుడూ అంతే!

"ఏమిటోయ్ ఇది"

"లోన్ కోసం దరఖాస్తు"

"అదే, దేనికని."

'కారణం చెబితే కానీ శాంక్షన్ చేయవా'

మనసులోనే విసుక్కున్న గంగాధరం పైకి మాత్రం 'చిన్న ప్రాబ్లమ్ సాల్వ్ చేసుకోవాలని...' నసిగాడు నెమ్మదిగా.

"నీకు... ప్రాబ్లమ్సా?" అంటూ ఎదురుప్రశ్న వేశాడు ఆఫీసర్.

ఏసీ ఛాంబర్‌లో గ్రీన్ ఇంక్ సంతకాలతో, కంపెనీ కారులో షికారు చేస్తూ సందడిగా హుషారుగా జీవితాన్ని గడిపే ఆఫీసర్‌కి ఆర్థిక సమస్యలెలా తెలుస్తాయి? మధ్య, దిగువస్థాయి ప్రజలకు తప్ప... గంగాధరం అనుకుంటున్నాడు.

"చెప్పవోయ్, గంగాధరం! సమస్యలేమిటో? నీకింకా పిల్లలే లేరు కదూ. అప్పులూ, ఆర్థిక ఇబ్బందులూ అసలు లేవని నాకు తెలుసు. పొదుపరివి. వ్యసనాలు నీకు ఆమడదూరం. మరి ఇంత డబ్బు అప్పుగా ఎందుకో"

ఇక తప్పదని గంగాధరం విషయం వివరించాడు. వింటున్న ఆఫీసర్ ఒక్కసారి భృకుటి ముడివేశాడు.

తర్వాత సీరియస్‌గా ముఖం పెట్టి– "చూడు, గంగాధరం. కన్న తల్లిదండ్రులే భారం అనుకుంటున్న పాడు లోకం ఇది. ఏ కసాయి కొడుకో తల్లి అంత్యక్రియలకు వేలకొద్దీ ఖర్చవుతుందని భయపడి వీధుల్లోకి ఈడ్చి వదిలించుకున్నాడు కాబోలు. నువ్వు సానుభూతితో కరిగిపోతే అడుగడుగునా అనాథ వృద్ధులే అగుపడతారు. అందర్నీ ఆదుకోగలవా, చెప్పు..."

ఏం చెప్పలేదు, మౌనంగా నిష్క్రమించాడక్కడ్నుంచి గంగాధరం.

లోన్ శాంక్షనైంది. బ్యాంకు నుంచి డబ్బు విత్‌డ్రా చేసుకున్నాడు గంగాధరం. ఆ ముసలామెను ఇక వృద్ధాశ్రమంలో చేర్చడమే తరువాయి... అనుకుంటూ ఇంటికి వచ్చాడో, లేదో శ్రీమతి అందించిందా వార్తని. వినీ వినగానే ఒక్క ఉదుటున పరుగు లంకించుకున్నాడు గంగాధరం ఆ మర్రిచెట్టు దగ్గరికి.

ఆప్యాయతలు కనుమరుగవుతున్న ఈ లోకం నుంచి శాశ్వతంగా సెలవు పుచ్చేసుకుంది ఆ ముసలమ్మ.

"అమ్మా...!" ఒక్కసారిగా గంగాధరం నోటివెంట అప్రయత్నంగా వెలువడిందా మాట.

కంటి కొలకుల నుంచి జాలువారిన ఓ బిందువు ఆమె శుష్క దేహంపై పడింది. జేబులో బరువుగా ఉన్న కొత్త కరెన్సీని తడుముకున్నాడు గంగాధరం.

"దేనికోసం తెచ్చిన సొమ్ము దేనికోసం ఖర్చవుతోందో కదా!" మనసులో బాధ మెలితిరిగింది.

ఎవరేమనుకున్నా సరే, ముసలమ్మ అంత్యక్రియలు ఘనంగా చేయాలి... నిశ్చయించుకున్నాడు గంగాధరం.

ఆ రాత్రి చీకట్లో, చలిలో అలాగే కూర్చున్నాడు గంగాధరం– శవజాగరణ చేస్తూ.

ఉదయాన్నే అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేసి వస్తూ వస్తూ... దారిలో ఆఫీసర్ ఇంటికి వెళ్లాడు గంగాధరం– ఆఫీసుకి రానని సెలవు చెప్పేందుకు.

## మనవి

ఏప్రిల్ 2002 'పత్రిక' చిత్రభాను నూతన సంవత్సర ప్రత్యేక సంచికగా, రెగ్యులర్ వీక్లీ సైజులో వెలువరించాలని నిర్ణయించాం. వెల రు. 10/-. ఈ ఉగాది సంచికను అందరూ హాయిగా చదువుకునేలా హాస్యరస ప్రధానంగా రూపొందించాలన్నది మా సంకల్పం. మా సంకల్పం కార్యరూపం దాల్చడానికి రచయితల, రచయిత్రుల, కార్టూనిస్టుల సహకారం ఎంతో అవసరం. పత్రిక ఆకర్షణీయంగా వెలువడడానికి తమ రచనలను మార్చి 15లోగా మాకు పంపి, సహకరించాల్సిందిగా కోరుతున్నాం. ఇంటింటా పండగ వాతావరణాన్ని తీసుకురావడానికి అనువైన చిన్న కథలు, స్కెచ్‌లు, కార్టూన్‌లు, కవితలు సకాలంలో పంపవలసిందిగా మరోసారి కోరు తున్నాం.

మా చిరునామా:

**మోనికా పబ్లికేషన్స్**

79బి, జర్నలిస్టు కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.

కాలింగ్ బజర్ మోగించబోగా మాటలు విన్పించడంతో ఆగిపోయాడు గుమ్మంలోనే గంగాధరం.

"ఇంతకీ ఆ ముసల్దాని పీడ వదిలినట్లేనా?" ఆఫీసర్ భార్య గొంతు కాబోలు ఖంగుమని మోగుతోంది.

"అర్ధరాత్రి వేళ దారీతెన్నూ తెలీనిచోట వదిలేశాక కూడా నీకెందుకా భయం" ఆఫీసర్ మాట అది.

"ఏమో, తీరా ఇల్లు కనుక్కుని వచ్చి ఇక్కడే గుటుక్కుమందా... అంత్యక్రియలకంటూ బోల్డంత ఖర్చు. మనకు చచ్చే చావు. వృద్ధాప్యం అంటూ వచ్చాక ఆధారపడుతూ ఎందుకా బతుకు. ఎవరిని ఉద్ధరించాలని, చిటికెడు విషం తాగి చచ్చే వీలుని చట్టం కల్పిస్తే ఎంత బాగుండునో?"

ఆఫీసర్ భార్య సణుగుడు విన్పిస్తూనే ఉంది బయట వున్న గంగాధరానికి.

"అంటే..." స్థాణువే అయ్యాడు గంగాధరం.

ఆఫీసర్‌కి, ఆ మర్రిచెట్టు నీడలో వున్న అవ్వకూ మధ్య వున్న బాంధవ్యం అర్థమైంది గంగాధరానికి. చిరునవ్వునే వెలివేసినట్లుండే ఆఫీసర్ ముఖం కళ్లముందు కదలాడింది ఒక క్షణంసేపు.

సిరిసంపదలున్నా, సమాజంలో మంచి హోదా, ఉద్యోగం ఉన్నా, హై సొసైటీ మనిషిగా పేరు ప్రఖ్యాతులున్నా అతడి పిడికెడు గుండెలో ఎంత కరుకుదనమో? ఎంత ఇరుకుదనమో? కని, పెంచి పెద్దచేసిన తల్లిపై వృద్ధాప్యం పంజా విసిరితే ఆదుకుని ఆత్మీయంగా చూసుకోవాల్సిందిపోయి పాత బట్టల మూట విసిరేసినట్లు ఎంచక్కా వీధిలోకి విసిరేయడం? తలచుకుంటే చాలు గంగాధరం హృదయం భగ్గుమంటోంది...

ఇపుడా తల్లి చనిపోయిందని ఆఫీసర్‌కి చెప్పాలా? అవసరం లేదనిపించిందతడికి. చేయాల్సిన తదుపరి కర్తవ్యం గుర్తొచ్చి మర్రిచెట్టు వైపు కదిలాడు గంగాధరం, అమ్మకాని అమ్మకు అంత్యక్రియలు జరిపించేందుకు.

కనిపెంచిన వాళ్లందరూ కొడుకులు కాలేరు. మర్రిచెట్టులో కాదు దయ్యాలు బసచేసేది. ఇదిగో, ఇలాంటి అక్కరకురాని కొడుకుల బుర్రల్లో.

అంతే!

గంగాధరం వడివడిగా నడుస్తున్నాడు మర్రిచెట్టు నీడలోకి...!

○